క్లుప్తంగా

గనుల కేటాయింపుపై హర్షం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌కు గర్భాం మాంగనీస్ గనుల లీజును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించడంపై ఉక్కు సీఎండీ అతుల్‌భట్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు ఎంపీ భరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ


విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేస్తున్న శ్రావణ్ షిప్పింగ్ ప్రతినిధులు

పెదగంట్యాడ: శ్రావణ్ షిప్పింగ్ అధినేత సాంబశివరావు ఉదారతను చాటుకున్నారు. సుమారు రూ.లక్ష విలువ చేసే యూనిఫాంలను మండలంలోని గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్ రెడ్డి, చైతన్య, శ్రీనివాసరాజు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బోడిపిల్లి దేముడు తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని అధిగమిస్తే సత్ఫలితాలు


మాతాజీ నితాయి సేవినిని సత్కరిస్తున్న విజ్ఞాన్ ప్రిన్సిపాల్ సుధాకర్

అగనంపూడి: వ్యక్తి విధి నిర్వహణతో పాటు దైనందిన జీవితంలో ఒత్తిడిని ఎలా అధిగమించాలి, వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవడం ఎలా అనే అంశాలను ఇస్కాన్‌కు చెందిన వ్యక్తిత్వ వికాస నిపుణురాలు మాతాజీ నితాయి సేవిని వివరించారు. దువ్వాడలోని విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసంపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆమె ప్రసంగించారు. స్వీయ అవగాహన, స్వీయ నియంత్రణ కలిగి ఉంటే మనం తీసుకొనే నిర్ణయాలు విజయవంతం అవుతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, వైఎస్ ప్రిన్సిపాల్ రవీంద్ర, వివిధ విభాగాల డీన్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శనిత్రయోదశి పూజలు


శనీశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: శనిత్రయోదశి పురస్కరించుకుని జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలోని ఉమారామలింగేశ్వరాలయం ఎదురుగా ఉన్న శనీశ్వరాలయంలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. నువ్వులు, నవధాన్యాలతో శనీశ్వర విగ్రహాలకు అర్చన చేశారు.

గుండెపోటుతో అర్చకుడు మృతి


రాధా కృష్ణ (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ స్వామి అయ్యప్ప దేవాలయ అర్చకుడు శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు ఎస్.నాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా పాతపట్నానికి చెందిన రాధా కృష్ణ (46) కొద్ది నెలలుగా షీలానగర్‌లో స్వామి అయ్యప్ప దేవాలయంలో అర్చకుడిగా సేవలు అందిస్తున్నాడు. శుక్రవారం రాత్రి ఆయన ఒక్కసారిగా అస్వస్థకుగురవ్వడంతో ఆయన సహచరులు, దేవాలయ కమిటీ ప్రతినిధులు షీలానగర్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య, 8వ తరగతి చదువుతున్న కుమార్తె ఉన్నారు.

భగ్గుమన్న వైద్య లోకం


లంకెలపాలెం యూపీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది


గాజువాకలో ర్యాలీ చేపడుతున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది

ఉక్కునగరం: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన ఘాతుకాన్ని ఖండిస్తూ శనివారం నిరసనలు హోరెత్తాయి. నిందితులను కఠినంగా శిక్షించాలని నినదించారు. స్టీల్‌ప్లాంట్‌లో ఉక్కు కార్మిక సంఘాల నాయకులు, వైద్యులు, ఉద్యోగులు పొట్టి శ్రీరాములు కూడలి వద్ద ప్లకార్డులు ప్రదర్శించారు. దుండగులను కఠినంగా శిక్షించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వైద్యులు డాక్టర్ ఎం.ఎస్ అన్నపూర్ణ, డాక్టర్ బి. కావ్య, డాక్టర్ మౌనిక, డాక్టర్ కావ్యలు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం కృషి చేసే వైద్యులకు రక్షణ లేకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో ఉక్కు కార్మిక నాయకులు డి. ఆదినారాయణ, ఎస్. రామారావు, కె.ఎస్.ఎన్.రావు, కె. పరంధామయ్య పాల్గొన్నారు.

వైద్యులకు రక్షణ కల్పించాలి : దేశంలోని వైద్యులకు రక్షణ కల్పించాలని ఉక్కు జనరల్ ఆస్పత్రి విభాగాధిపతి డాక్టర్ ఎ.పి. నవీన్‌కుమార్ డిమాండ్ చేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు శనివారం ఉక్కు ఆస్పత్రిలో అత్యవసర మినహా అన్ని సేవలు నిలిచిపోయాయి. వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది దాడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వైద్యులపై దాడి జరిగిన వెంటనే చర్యలు తీసుకునేలా చట్టాలు ఉండాలన్నారు. అలాంటి పరిస్థితుల్లోనే వైద్యులు మంచి వైద్యం అందించగలరన్నారు.

గాజువాకలో ..

గాజువాక: గాజువాకలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో పాతగాజువాకలో ప్రారంభమైన ర్యాలీ కొత్తగాజువాక వరకు కొనసాగింది. అనంతరం ఐఎంఏ ప్రతినిధి డాక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు ఎం.రమేష్ కుమార్, ఎల్.బుల్లయ్య పాల్గొన్నారు.

అగనంపూడి: కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ ప్రభుత్వ వైద్యశాలలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ లంకెలపాలెంలోని యుపీహెచ్‌సీ వద్ద వైద్యాధికారి డాక్టర్ దివ్యలత ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫార్మసీ ఆఫీసర్ రమణ, సుజాత, జ్యోతి, రమణబాబు, భూలక్ష్మి, రామలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


పొట్టి శ్రీరాములు కూడలి వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, నాయకులు, మహిళలు


ఉక్కు ఆస్పత్రిలో నిరసన ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది

ఎమ్మెల్సీ బొత్సకు అభినందనల వెల్లువ


ఎమ్మెల్సీ బొత్సకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్పొరేటర్ గుడివాడ అనూష, లతీష్


ఎమ్మెల్సీ బొత్సకు శుభాకాంక్షలు తెలుపుతున్న 87వ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు తదితరులు

అక్కిరెడ్డిపాలెం: ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన బొత్స సత్యనారాయణకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం బొత్సను ఆయన నివాసంలో 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష, లతీష్ దంపతులతో పాటు 69వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొగాది సన్యాసిరావు , వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీలకర్ర నాగేంద్ర కలిసి అభినందనలు తెలిపారు.

అగనంపూడి: ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, 87వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు అభినందించారు. అలాగే రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ జి.పూర్ణానంద శర్మ (పూర్ణ) కూడా ఎమ్మెల్సీ బొత్సను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు యలమంచిలి అప్పారావు, విందుల వరప్రసాద్, పట్టా రామకృష్ణ ఉన్నారు.

24 నుంచి సత్తెమ్మతల్లి మహోత్సవాలు


పంచామృతాలతో అభిషేకిస్తున్న భక్తులు

గాజువాక : కొత్తగాజువాక రాజీవ్‌మార్గ్‌లోని సత్తెమ్మతల్లికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అమ్మవారికి పంచామృతాభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 24 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న అమ్మవారి మహోత్సవాలను పురస్కరించుకొని జలాభిషేకాలతో పాటు పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సూరిశెట్టి శివ మాట్లాడుతూ 25న అమ్మవారి ప్రధాన పండగ ఉంటుందన్నారు. కార్యక్రమంలో దొడ్డి రమణ, మద్దాల అప్పారావు, శరగడం కోటి, శరగడం సత్యనారాయణ, భీశెట్టి సింహాచలం నాయుడు, కాండ్రేగుల హరినాథ్, మళ్ల నర్సింగరావు పాల్గొన్నారు.

ఉచిత ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అక్కిరెడ్డిపాలెం: హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నడుపుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ , బొల్లినేని మెడ్ స్కిల్స్ సంయుక్తంగా ఫుడ్ అండ్ బెవరేజ్ సర్వీస్ అసోసియేట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు షీలానగర్‌లోని బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు శనివారం తెలిపారు. ఈ కోర్సులు ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని రెండో అంతస్తులోని స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 28 ఏళ్లలోపు పురుషులు, మహిళలు అర్హులన్నారు. మూడు నెలల పాటు శిక్షణతో ఉచిత భోజన, వసతి, యూనిఫాం, బుక్స్, ఏసీ క్యాంపస్ వంటి సదుపాయాలు ఉంటాయని తెలిపారు. ఇంటర్ పాసైన యువతీ యువకులకు బీఎస్సీ, డిప్లమో పారామెడికల్ కోర్సులకు కూడా అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు పూర్తి వివరాలకు బొల్లినేని మెడ్‌స్కిల్స్, హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, ద్వారకానగర్, విశాఖపట్నం చిరునామాలో సంప్రదించాలని పేర్కొన్నారు. 7207953290, 7993011605 నంబర్లను కూడా సంప్రదించవచ్చునన్నారు.

ప్రిన్స్ వరల్డ్ 2024గా కార్తికేయ రెడ్డి


బ్యాంకాక్‌లో వేదికపై కార్తికేయ రెడ్డి



తల్లిదండ్రులు, సోదరితో కార్తికేయ రెడ్డి

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌కు చెందిన కార్తికేయ రెడ్డి ప్రిన్స్ వరల్డ్ 2024గా నిలిచాడు. థాయ్‌లాండ్ వేదికగా బ్యాంకాక్‌లో జరిగిన జూనియర్ మోడల్ ఇంటర్నేషనల్ పోటీలో భారతదేశం నుంచి ప్రాతినిధ్యం వహించి సత్తాచాటి టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. బ్యాంకాక్‌లో జరిగిన ప్రపంచ ఫైనల్స్‌లో పాల్గొన్న ఎనిమిదేళ్ల కార్తికేయ రెడ్డి అన్ని అంశాల్లో తన ప్రతిభను కనబర్చి ప్రిన్స్ విభాగంలో విజేతగా నిలిచి టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. 11 దేశాల నుంచి దాదాపు 45 మంది పాల్గొనగా కార్తికేయ రెడ్డి విజయం సాధించడం విశేషం. దేవతా మూర్తిగా..కార్తికేయుని వేషధారణలో అలరించాడు. కార్తికేయ రెడ్డి తండ్రి బి.జె.శ్రీనివాస రెడ్డి ఈఐఎల్‌లో ఎంజీఎంగా విధులు నిర్వర్తిస్తుండగా తల్లి పావనీ లత భెల్ (హెచ్‌పీవీపీ) విశాఖ యూనిట్‌లో ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. కార్తికేయరెడ్డి నాల్గో తరగతి చదువుతున్నాడు.

ముగిసిన ధ్యాన యజ్ఞం


ముగింపు సమావేశానికి హాజరైన స్థానికులు

పెదగంట్యాడ: ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద్, పత్రీజీ పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ ప్రతినిధి మీసాల శివ గణేశ్వరరావు అన్నారు. భగవాన్ పితామహ పత్రీజీ దివ్య ఆశీస్సులతో మండలంలోని యారాడ గ్రామంలో గల పీఎస్సార్ కాలనీలో 41 రోజుల పాటు నిర్వహించిన ధ్యాన యజ్ఞనం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యారాడ గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. పీఎస్సార్ కాలనీలోని యువజన సేవా సంఘం భవనంలో 41 రోజుల పాటు ధ్యాన యజ్ఞం కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో బోరాడ రమణ, అప్పారావు, నాగోతి రమణ, బంక ఆంజనేయ పాత్రుడు, చిన్నారావు, సంధ్యా కుమారి, సుబ్బారావు, ఉమా కనకారావు పాల్గొన్నారు.

పింఛన్ల అందజేత


పింఛన్ అందిస్తున్న సర్వహితచారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ సారథ్యంలో ప్రతీనెలా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా 65 మంది నిరుపేద వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు అగనంపూడి నిర్వాసితకాలనీ పెదమడకలోని శనివారం అందించారు. అనారోగ్యం కారణంగా పింఛన్ తీసుకోడానికి రాలేని ఆరు కుటుంబాలకు ఇంటికి వెళ్లి పింఛన్ సొమ్ముతోపాటు 25 కేజీల బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులు అందించారు. ట్రస్ట్ గౌరవాధ్యక్షుడు వానపల్లి వెంకటరమణ, శ్రీదేవి దంపతుల చేతుల మీదుగా వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ ఎం.మస్తాన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జామి గణేష్, వ్యవస్థాపకుడు గుదే సుశీలా గజేంద్రరావు, సలహాదారు పట్టా రామ అప్పారావు, ప్రతినిధులు హనుమంతురావు, లక్కరాజు రాము, పిళ్లా శ్రీను, శీరంశెట్టి గోవిందరావు, బొండా ఈశ్వరరావు, పూడి నరేష్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎస్‌ఎంసీ ఎన్నికలు


లంకెలపాలెం హైస్కూల్ కమిటీతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న హెచ్‌ఎం నాగేశ్వరరావు


లేమర్తి హైస్కూల్ కమిటీ ప్రతినిధులతో పాఠశాల సిబ్బంది

అగనంపూడి: జీవీఎంసీ 79, 85 వార్డుల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల యాజమాన్య కమిటీ (ఎస్‌ఎంసీ)ల ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. పలు చోట్ల ఎన్నికలు ఏకగ్రీవంగా జరగగా, మరికొన్ని చోట్ల చేతులెత్తే పద్ధతిలో ఎన్నికలు నిర్వహించారు.

- 79వ వార్డు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్‌గా గుర్రం అప్పలరాజు, వైస్ చైర్మన్‌గా గండేపల్లి మణిరత్నకుమారి ఎన్నికయ్యారు. 6 నుంచి 10 తరగతులకు చెందిన 15 మంది కమిటీ సభ్యులు వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు పాఠశాల హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు తెలిపారు.
- 85వ వార్డు పినమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్‌గా యలమశెట్టి శ్రీను, వైస్ చైర్మన్‌గా మొయిదవలస శ్రీవాణి ఎన్నికయ్యారు. 3వ తరగతి నుంచి పదో తరగతి వరకు మొత్తం 24 మంది కమిటీ సభ్యులు అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నట్టు మండల విద్యాశాఖాధికారి సాయి శైలజ తెలిపారు.
- 85వ వార్డు ఫార్మాసిటీ నిర్వాసితకాలనీ లేమర్తి హైస్కూల్ యాజమాన్య కమిటీ చైర్మన్‌గా జంపా నాగేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా షేక్ భారతి ఎన్నికూనట్టు పాఠశాల హెచ్‌ఎం అమ్మాజీ తెలిపారు.
- పెదముషిడివాడ హైస్కూల్ కమిటీ చైర్మన్‌గా సింహాచలం, వైస్ చైర్మన్‌గా బోడేం గంగాదేవి ఎన్నికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణ తెలిపారు. పరవాడ మండల విద్యాశాఖాధికారులు దివాకర్‌రావు, సాయి శైలజల పర్యవేక్షణలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ఎంవీపీకాలనీ: చినవాల్తేర్ విద్యానగర్ కాలనీకి చెందిన కె.గోవిందరెడ్డి(51) అనే వ్యక్తి అనుమానాస్పద మృతిపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. గోవిందరెడ్డి శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో శివాజీపాలెంలోని అత్తారింటికి వెళ్లాడు. రాత్రి 11.30 గంటల సమయంలో గోవిందరెడ్డి భార్య సరోజ చనిపోయి ఉన్న అతడిని తీసుకొని చినవాల్తేర్‌లోని అత్తింటికి వచ్చింది. దీంతో గోవిందరెడ్డి కుటుంబ సభ్యులు ఆందోళన చెందడంతోపాటు అతడి శరీరంపై గాయాలు ఉండటంతో కావాలనే చంపేశారనే అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు గోవిందరెడ్డి తండ్రి రాము ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు గుర్తింపు కార్డులు


విద్యార్థులకు గుర్తింపు కార్డులు అందిస్తున్న ఎస్ఎంసీ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ కొండయ్యవలస ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దాతలు అందించిన గుర్తింపు కార్డులను స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ చైర్మన్ జి.నాగమణి అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అప్పారావు, గ్రామ నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, విందుల వరహాలు, మరిశా వెంకటేశ్వరరావు, బండారు చందు, గోక్యాడ శ్రీను, నెల్లి వెంకటేష్ పాల్గొన్నారు.

ముడిసరకు ఇప్పించి స్టీల్ ప్లాంట్‌ను ఆదుకోవాలి



మాట్లాడుతున్న నీరుకొండ రామచంద్రరావు

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగారం నడవడానికి వీలుగా కేంద్ర ప్రభుత్వం తక్షణమే ముడిసరకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు నీరుకొండ రామచంద్రరావు, వరసాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెం కూడలిలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శనివారానికి 1283వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముడి సరకు నిల్వలు తగ్గిపోవడం కేంద్ర ప్రభుత్వం కుట్రలో భాగమని ఆరోపించారు. ఉక్కు ఉత్పత్తికి విఘాతం కలిగించి, కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించకుండా ఉక్కు ఆస్తులను ప్రైవేటు తొత్తులకు అప్పజెప్పాలనే లక్ష్యంతో ఉన్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎస్.రామారావు, డి.శ్రీనివాస్, రమణమూర్తి, కొమ్ము ప్రసాద్, గోపాలరాజు, సుబ్బారావు, శ్రీనివాసరావు, నరసింగరావు, మధు, రమేష్ పాల్గొన్నారు.

మద్దిలపాలెంలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం !

ఎంవీపీకాలనీ: గుడ్ల సింహాచలం అనే వ్యక్తి ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన ఎంవీపీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలిలా.. మద్దిలపాలెంలో సింహాచలం ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. జీవీఎంసీ అధికారులు ప్లాస్టిక్ కవర్ల విక్రయం పేరుతో అతడిని వేధిస్తున్నారని ఆరోపిస్తూ పెట్రోల్ పోసుకొని శనివారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు వెల్లడించారు. వెంటనే వారు స్పందించి అతడిని కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం సింహాచలం అక్కడ చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులను వివరణ కోరగా.. తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

పరవాడ: మండలంలో కలపాక శివారు మూలస్వయంభూవరం వద్ద శుక్రవారం రాత్రి బొగ్గు లారీ మినీ వ్యానును ఢీ కొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా ఇద్దరు గాయపడ్డారు. పెదగంట్యాడ మండలం దాసరిపేటకు చెందిన ధర్మాల ఎల్లాజీరెడ్డి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందగా, కర్రి జనార్దన్‌రెడ్డి, డి.అనిల్‌కుమార్‌లు తీవ్రంగా గాయపడ్డారని పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు చెప్పారు. శుక్రవారం రాత్రి మూలస్వయంభూవరం నుంచి కలపాక వైపు వస్తున్న మినీ వ్యానును హిందూజా పరిశ్రమకు బొగ్గు లోడుతో వెళుతున్న లారీ బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మినీ వ్యాను దెబ్బతినగా అందులో ప్రయాణిస్తున్న వ్యాను డ్రైవర్ ఎల్లాజీరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన వారిని కేజీహెచ్‌కు తరలించామని చెప్పారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించామని చెప్పారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని సీఐ బాలసూర్యారావు చెప్పారు.


సంప్రదాయ కళలను ప్రోత్సహిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రమౌళి

మురళీనగర్ : మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో భారతీయ సంప్రదాయ కళలను ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి చెప్పారు. మురళీనగర్ వాకర్స్ పార్కులోని క్లబ్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పౌరాణిక పద్య నాటకాల ప్రదర్శన, శాస్త్రీయ, జానపద నృత్యాల్లో ప్రతిభావంతులతో ప్రదర్శనలు ఏర్పాటు చేసి ప్రజలకు వాటి ప్రాధాన్యతను తెలియజేస్తామన్నారు. ఈ నెల 25న ఉచిత నేత్ర వైద్య శిబిరం, 29న గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం, కవితా గోష్ఠి, సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవం, వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయక ప్రతిమల పంపిణీ నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు ఎన్.బుచ్చయ్య, పి.చెల్వరాజు, జె.కూర్మారావు, ఏవీ సుబ్బారావు, ఎం.రామకృష్ణ, చొల్లంగి ప్రసాదరావు, జాలీ వాకర్, ఎస్.ప్రకాశరావు పాల్గొన్నారు.

22న ఉత్తరాంధ్ర కళా జాతర


మాట్లాడుతున్న రైటర్స్ అకాడమీ అధ్యక్షుడు రమణమూర్తి

సీతంపేట : ఉత్తరాంధ్ర కళలను భవిష్యత్ తరాలకు తెలియజేసేందుకే ఈ నెల 22న విశాఖలో ఉత్తరాంధ్ర కళా జాతర నిర్వహించనున్నట్టు రైటర్స్ అకాడమీ అధ్యక్షుడు వి.వి.రమణమూర్తి తెలిపారు. ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా నగరంలోని గురజాడ కళాక్షేత్రంలో సుమారు 2 వేల మంది సమక్షంలో భారీ కళా జాత నిర్వహిస్తామని తెలిపారు. కళా సంఘాల ప్రతినిధులతో కలిసి శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్, హోం మంత్రి వంగలపూడి అనిత, స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో ఆచార్య డి.వి.సూర్యారావు, కళాకారులు చిన్నారెడ్డి, విక్రమ్ గౌడ్, చలసాని కృష్ణ ప్రసాద్, ధనుంజయ్, వి.త్రినాథ్, బాదంగీర్ సాయి, వీర్రాజు, కొణతాల రాజు, వర్రె నాంచారయ్య, మేడా మస్తాన్ రెడ్డి పాల్గొన్నారు.